

## ఆకతాయికి దేహశుద్ధి

కారుకు పోలీస్ హారన్ బిగించి మహిళల సమీపంలోకి వెళ్లి హారన్ కొట్టి టీజ్ చేస్తున్న ఆకతాయిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు.

- 8లో..



## యువకుడు అనుమానాస్పద మృతి

సింగరాయకొండ వద్ద జాతీయ రహదారిపై ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/25

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### ఐటీఐ విద్యార్థులకు జాబ్ మేళా

ఒంగోలు: స్థానిక గుంటూరు రోడ్డులోని ప్రభుత్వ బాలికల ఐటీఐ కాలేజీలో ఈ నెల 11వ తేదీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్, జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బాలికల ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరిదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైకి చెందిన మోడైన్ థర్మల్ ప్రైవేట్ లిమిటెడ్, త్రోవగుంటకు చెందిన లీలా గ్రానైట్స్, జయలక్ష్మి ఆటోమోటివ్స్, ఒంగోలుకు చెందిన స్వాతి పైప్స్‌తో పాటు పలు స్థానిక కంపెనీలు కూడా జాబ్ మేళాలో పాల్గొంటున్నాయన్నారు. ఐటీఐ చదువుతున్న, పాసైన అభ్యర్థులను ఉద్యోగం లేదా అప్రంటీస్ శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం శిక్షణ భృతి చెల్లిస్తారని, అభ్యర్థులు వారి వివరాలను అప్రెంటీస్‌షిప్‌ఇండియా.ఓఆర్‌జీ అనే పోర్టల్లో రిజిస్టర్ చేసుకుని బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లుతో పాటు జెరాక్స్ కాపీలతో జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగపరచుకోవాలని సూచించారు. వివరాలకు అడ్వైజర్ 7981052699ను సంప్రదించాలని కోరారు.

### కేజీ పొగాకు గరిష్ట ధర రూ.364



పొదిలి వేలం కేంద్రంలో ఉన్న పొగాకు బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో శనివారం నిర్వహించిన పొగాకు వేలంలో కేజీ గరిష్ట ధర రూ.364 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 5,735 పొగాకు బేళ్లు వేలానికి రాగా, 4,498 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 637 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో శనివారం జరిగిన 99వ రోజు వేలంపాటలో 3,357 బేళ్లు వేలానికి రాగా, 2,971 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 386 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.364, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.308.89 పలికింది. డీసీ పల్లి, కలిగిరి, కందుకూరు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో శనివారం 94వ రోజు నిర్వహించిన వేలంలో 1,776 బేళ్లు వేలానికి రాగా, 1,527 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 251 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.360, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.308.89 పలికింది.

### ఘనంగా జూనోసిస్ డే



పోలీస్ జాగిలానికి షేక్‌హ్యాండ్ ఇస్తున్న పశుసంవర్థక శాఖ జేడీ బేబీరాణి, అధికారులు

ఒంగోలు సెంట్రల్: వరల్డ్ జూనోసిస్ డేని శనివారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని బహుళార్థ పశువైద్యశాలలో పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచిత టీకాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ జాగిలాలను శాలువాలతో సన్మానించారు. పోలీస్ జాగిలాలు చేసిన సేవలను కొనియాడారు. శునకాల యజమానులు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశువుల నుంచి మనుషులకు సక్రమించే వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. ఒంగోలులో 303 శునకాలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేసినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి తెలిపారు. పలువురు జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులను తీసుకొచ్చి యాంటీ రేబిస్ టీకాలను ఉచితంగా వేయించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఆర్‌ఎంఓ రవికుమార్, డీడీలు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ సురేంద్ర ప్రసాద్, డాక్టర్ నాగార్జునబాబు, డాక్టర్ సీహెచ్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్లు సాహితి, స్వాతి, హరిణి, సిబ్బంది పాల్గొన్నారు.



పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి

జిల్లాలో కొన్నేళ్లుగా యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం నిలిచిపోయింది. వీధి కుక్కల సంతతి పెరిగిపోయింది. జనసంచారం లేని రోడ్డు ఉందేమోగానీ.. వీధి కుక్కల సంచారం లేని రోడ్డు లేదంటే అతిశయోక్తి కాదన్నట్లుగా పరిస్థితి తయారైంది. కొన్ని రోడ్లపై ఒకేచోట డజనుకుపైగా వీధి కుక్కలు కనిపిస్తున్నాయి. రాత్రులు వాహనాలను వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. పగటిపూట సైతం చిన్నారులు కనిపిస్తే దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో వీధి కుక్కల దాడుల్లో చిన్నారులు మృతిచెందిన సంఘటనలు చోటుచేసుకోవడంతో జిల్లావాసులు వణికిపోతున్నారు. భౌ..భౌ..అని వినిపిస్తేనే భీతిల్లిపోతున్నారు.

# భౌ బోయ్..!

- హడలెత్తిస్తున్న వీధి కుక్కలు
- అర్ధరాత్రులు రోడ్లపై గుంపులుగా సంచారం
- వాహనాల వెంట పరుగులు
- రాత్రులు రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్న ప్రజలు
- ఒంటరిగా చిన్నారులు కనిపిస్తే దాడులు
- అటకెక్కిన యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం



ఒంగోలు టౌన్:

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గుంపులు గుంపులుగా యథేచ్ఛగా తిరుగుతూ చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రజలను కరిచి గాయపరుస్తున్నాయి. రాత్రివేళ ఇంటి నుంచి బయటకు రావాలన్నా, పగలు సైతం జనసంచారం తక్కువగా ఉన్న సమయంలో ఒంటరిగా ఇంటికి వెళ్లాలన్నా ప్రజలు భయపడిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లి వచ్చే రైతులు, నగర శివారు ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వారు, ఇంటిముందు ఒంటరిగా ఆడుకునే చిన్నారులు, వాహనాలపై వెళ్లేవారు.. ఎవరు కనిపిస్తే వారిపై ఎగబడి రక్కేస్తున్నాయి. ఇటీవల కరవదిలో ఒక రైతు పొలం వెళ్లి వస్తుండగా ఏకంగా పది కుక్కలు పైనపడి కరిచేశాయి. ఇలాంటి ఘటనలు తరచూ జిల్లాలో జరుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు వీధి కుక్కలంటేనే భయపడిపోతున్నారు. పిల్లలను ఒంటరిగా స్కూలుకు పంపించాలంటేనే వణికిపోతున్నారు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులుగానీ, మున్సిపల్, పంచాయతీ అధికారులుగానీ కుక్కల బెడద గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఒంగోలులో ఎక్కడ చూసినా కుక్కల బెడదే...**

ఒంగోలు నగరంలో 50 డివిజన్లు ఉన్నాయి. గతంలో కేవలం శివారు ప్రాంతంలో మాత్రమే కుక్కలు కనిపించేవి. ఏదైనా పనిమీద శివారు ప్రాంతాలకు వెళ్లాలంటే అక్కడ కుక్కలుంటాయి..కరుస్తాయని ప్రజలు భయపడిపోయేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. నగరంలోని ఏ డివిజన్లో చూసినా కుక్కలే కుక్కలు. గుంపులుగా తిరుగుతూ జనాన్ని గుర్రుగా బెదిరిస్తున్నాయి. నగరం నడిబొడ్డున ఇస్లాంపేటలోని రెండో వీధిలో రెండో రోడ్డును స్థానికులు కుక్కల బజారుగా పిలుస్తుంటారంటే..నగరంలో కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో అంచనా వేయవచ్చు. గోపాల్‌నగర్, బలరాం కాలనీ, కమ్మపాలెం, క్లోపేట, బిలాల్ నగర్, కబేళా బజార్, గద్దలగుంట, ఆర్‌పీ రోడ్డు, సత్యనారాయణపురం, రంగుతోట, రైల్వేస్టేషన్ రోడ్డు ఇలా చెప్పుకుంటూపోతే కుక్కల బెడద లేని ఒక్క వీధి కూడా లేదని చెప్పవచ్చు.

**పెరిగిన పెంపుడు కుక్కలు...**

నగరంలో పెంపుడు కుక్కలు వేల సంఖ్యలో ఉన్నాయి. ప్రతి ఏడాది జూలై 6వ తేదీ నిర్వహించే జూనోసిస్ డే కార్యక్రమంలో పెంపుడు కుక్కల యజమానులు సుమారు 500 నుంచి 600 మంది వరకూ వారి కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు చేయిస్తున్నట్లు పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఒంగోలులోని సంతపేటలో గల పశువైద్యశాలకు ప్రతి రోజూ 100 వరకు పశువులను చికిత్స కోసం తీసుకొస్తుండగా.. వాటిలో కేవలం కుక్కలు మాత్రమే 70 వరకు ఉంటున్నాయని చెబుతున్నారు. పెంపుడు కుక్కల సంగతి ఇలా ఉంటే.. వీధి కుక్కలను పట్టించుకునేవారే లేరు. ఈ కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన పురపాలక శాఖ అధికారులు మొద్దునిద్రలో జోగుతున్నారు. దీంతో కుక్కలు కరిచినప్పుడు కొందరు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తోంది.

### ప్రాణాంతకంగా మారిన రేబిస్...

కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. కుక్క కాటు వేసిన వెంటనే వ్యాక్సిన్ వేయించుకోవాలి. లేకపోతే రేబిస్ వ్యాధి బారిన పడితే చాలా ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రాణాలకు గ్యారంటీ చెప్పలేని దుస్థితి. నరాల వ్యవస్థ మొత్తం దెబ్బతిని చివరికి ప్రాణాలు పోతాయి. రేబిస్ సోకిన వారిలో కొందరు మంచినీళ్లు తాగడానికి కూడా భయపడిపోతారు. ఈ లక్షణాన్ని వైద్య పరిభాషలో హైడ్రోఫోబియా అంటారు. నీళ్లు తాగకపోవడంతో డీ హైడ్రేషన్ ఏర్పడి మరణానికి గురవుతారు. అందుకే.. కుక్క కరిచిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి యాంటీరేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) చేయించుకోవాలి. తీవ్రమైన గాయాలు అయినప్పుడు, పిచ్చికుక్క కాటు వేసినపుడు, కాటు తీవ్రతను బట్టి హిమునోగ్లోబిన్ ఇంజక్షన్లు వేస్తారు. దీని వలన తక్షణమే వ్యాధి నిరోధక శక్తి చేకూరుతుంది. అదే ఏఆర్‌వీ వలన వ్యాధి నిరోధక శక్తి సమకూరడానికి 3 నెలల వరకు పట్టవచ్చు. ఒంగోలు జీజీహెచ్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో 50 మందికి, మే నెలలో 56 మందికి, జూన్ నెలలో 47 మందికి హిమునోగ్లోబిన్ ఇంజక్షన్లు వేశారు.

### గత మూడు నెలల్లో 279 మంది పిల్లలను కరిచిన కుక్కలు...

జిల్లాలోని ఒంగోలు నగరంతో పాటు పరిసర ప్రాంతాలైన సింగరాయకొండ, చీమకుర్తి, కరవది, మద్దిపాడు, కందుకూరు, నాగులుప్పలపాడు తదితర మండలాల్లో కుక్కకాటుకు గురైన వారిలో ఎక్కువ మంది నిరుపేదలు చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు వస్తుంటారు. గత మూడు నెలల్లో ఈ ప్రాంతంలో 1,292 మంది కుక్క కాటుకు గురై చికిత్స కోసం వచ్చారు. వీరిలో 279 మంది చిన్నారులు ఉండటం ఆందోళన కలిగించే విషయం. మరో 1,013 మంది పెద్దలు కుక్కకాటుకు గురయ్యారు. ఏప్రిల్ నెలలో 451 మందిని కుక్కలు కరిచాయి. వీరిలో 91 మంది చిన్నారులు కాగా, 360 మంది పెద్దలు ఉన్నారు. మే నెలలో 459 మందిని కుక్కలు కరిచాయి. వీరిలో 102 మంది చిన్నారులు ఉండగా, 357 మంది పెద్దలు ఉన్నారు. జూన్ నెలలో 382 మందిని కుక్కలు కరిచాయి. వీరిలో 86 మంది చిన్నారులు ఉన్నారు. పెద్దలు 296 మంది ఉన్నారు.

### పాఠశాలలు తెరవడంతో చిన్నారుల తల్లిదండ్రుల్లో ఆందోళన...

జూన్ నెలలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా 4 నుంచి 5 ఏళ్ల చిన్నారులను పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలను పాఠశాలల్లో వదిలి తల్లిదండ్రులు పొలాలకు వెళ్తుంటారు. దీంతో చిన్నారుల భద్రత మీద ఆందోళన చెందుతున్నారు. పల్లెల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో పిల్లలు స్కూలు నుంచి ఒంటరిగా వచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనని భయాందోళన చెందుతున్నారు. పట్టణాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఏ వీధిలో చూసినా కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో తల్లిదండ్రులు టెన్షన్‌కు గురవుతున్నారు.

### జీజీహెచ్‌లోని వార్డుల్లో కుక్కల సంచారం...

ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లోని వార్డుల్లో కుక్కలు సంచరిస్తున్నాయి. ముఖ్యంగా ప్రసూతి వార్డు దగ్గర కుక్కలు కనిపిస్తున్నాయి. కాన్పు జరిగిన రోజే బీసీజీ వ్యాక్సిన్ వేయించేందుకు శిశువులను ఇతర వార్డులకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే, వార్డులోపల కుక్కలు సంచరిస్తుండటంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి దురదృష్టకర ఘటన జరగలేదు. కానీ, ఏదైనా సంఘటన జరిగితేగానీ జీజీహెచ్ అధికారులు స్పందించేలా లేరని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. జీజీహెచ్‌లో కుక్కలు తిరుగుతున్న విషయంపై గతంలో అనేక సార్లు పత్రికల్లో కథనాలు వచ్చాయి. వాటిని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు జీజీహెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా పట్టించుకోలేదు. నాలుగు రోజులు హంగామా చేసి వదిలేస్తున్నారు. దీంతో ఇక్కడ కాన్పులు చేయించుకున్న గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

### అటకెక్కిన బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం...

నిజానికి కుక్కలు పెరగకుండా యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం నిర్వహించాల్సి ఉంది. ఇందులో మగ కుక్కలకు క్యాస్ట్రేషన్ చేస్తారు. ఆడ కుక్కలకు గర్భసంచి తీసేస్తారు. దీంతో పునరుత్పత్తి జరగదు. క్రమంగా కుక్కల సంఖ్య తగ్గిపోతుంది. అయితే, ఒంగోలు నగరంలోగానీ, జిల్లాలో ఎక్కడా ఏబీసీ ప్రోగ్రాం జరిగిన దాఖలాలు లేవు. అధికారులు మాత్రం ఆపరేషన్లకు సిద్ధం చేశాం, త్వరలో కుక్కలకు ఆపరేషన్లు చేయిస్తామంటూ చెప్పి తప్పించుకుంటున్నారు. వాస్తవానికి నామమాత్రంగా కూడా చర్యలు తీసుకోవడంలేదని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

# ఇసుక అందుబాటులో ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు



సతుకుపాడులో ఇసుక డంప్‌లు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుకను అందుబాటులో ఉంచేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్, గనులు, భూగర్భ వనరుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియాతో పాటు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, గనులు, భూగర్భ వనరులశాఖ జిల్లా అధికారి జగన్నాథరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఒంగోలు మార్కెట్ యార్డులో ఉన్న ఇసుక నిల్వ, జరుగుమల్లిలోని రెండు ఇసుక స్టాక్ పాయింట్లను కలెక్టర్ సందర్శించారు. నిల్వలు, ప్రధాన వనరుల వివరాలను గనులు, భూగర్భ వనరులశాఖ జిల్లా అధికారి జగన్నాథరావు కలెక్టర్‌కు వివరించారు.

**ఇసుక డంప్‌లను పరిశీలించిన కలెక్టర్**

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని సతుకుపాడు రీచ్‌లోని రెండు ఇసుక డంప్‌లను శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. మైనింగ్ శాఖ డీడీ జగన్నాథరావు మాట్లాడుతూ సోమవారం నుంచి ఇసుక డంప్‌ల వద్ద అమ్మకాలు ప్రారంభమవుతాయని డంప్‌ల వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెవెన్యూ, సెబ్, మైనింగ్ శాఖల ఆధ్వర్యంలో కమిటీలు వేసి పర్యవేక్షణ చేయనున్నట్లు వివరించారు. జేసీ ఆర్. గోపాలకృష్ణ, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, తహసీల్దార్ చక్రవర్తి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకృష్ణ, సెబ్ ఎస్సై సీహెచ్ దయాకర్, ఈఓఆర్డీ అంజలీదేవి, ఆర్‌ఐ ఎం. రమణయ్య, వీఆర్‌ఓ డి. మధుసూదన్ పాల్గొన్నారు.

**42,833 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ**

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో పలు చోట్ల నిల్వ ఉన్న ఇసుకను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శనివారం అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. జరుగుమల్లి మండలంలోని సతుకుపాడు గ్రామంతో పాటు ఒంగోలులోని పాయింట్లను సందర్శించారు. మొత్తం మూడు ప్రదేశాలలో సుమారు 42,833 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు గనులు, భూగర్భ శాఖ జిల్లా అధికారి బి.జగన్నాథరావు తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉన్న ఇసుక నిల్వల నుంచి వినియోగదారులకు ఎంత ధరకు సరఫరా చేయాలి.? ఇసుక నిల్వల దగ్గర ఎవరు విధులు నిర్వహించాలనే విషయాలపై చర్చించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ తీసుకున్న నిర్ణయాల ప్రకారం టన్ను ఇసుక ధర రూ.247గా ప్రకటించారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్, సతుకుపాడు డంప్-1, డంప్-2లో రూ.247 చెల్లించి సొంత వాహనాలలో ఇసుక తీసుకెళ్లవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మూడు స్టాకు పాయింట్ల వద్ద తహసీల్దార్, మైన్స్, ఇరిగేషన్, ఎస్‌ఈబీ, పోలీస్ శాఖల నుంచి కేటాయించిన అధికారుల పర్యవేక్షణలో ఇసుక లోడ్ చేయనున్నట్లు చెప్పారు. వాహనాలు వచ్చిన వరుస క్రమంలో ఇసుక లోడ్ చేస్తారని తెలిపారు.

# ఆశా జ్యోతి.. జగ్జీవన్‌రామ్



కలెక్టర్ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఈఎఫ్ ఉద్యోగులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు

- జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి లక్ష్మానాయక్
- ఘనంగా జయంతి కార్యక్రమం

ఒంగోలు సెంట్రల్: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని వక్తలు కొనియాడారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో స్థానిక నెల్లూరు బస్టాండ్ వద్ద, కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి లక్ష్మానాయక్ మాట్లాడుతూ దళిత హక్కుల పరిరక్షణకు, పరిపాలన దక్షుడిగా జగ్జీవన్‌రామ్ పేరు పొందారని అన్నారు. దేశ సమగ్రతకు, జాతి సమైక్యతకు, భారత రాజ్యాంగానికి కాపాలాదారునిగా వ్యవహరించి దళితుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఏవో గరిబున్ నవాబ్, కార్యాలయ పర్యవేక్షకుడు డి.మధుసూదన్ రెడ్డి, సహాయ సాంఘిక సంక్షేమాధికారి టి.లింగయ్య, వసతి గృహాల సంక్షేమాధికారుల సంఘ అధ్యక్షుడు అంకబాబు, కార్యాలయ సిబ్బంది, ఎంఆర్‌పీఎస్ నాయకులు తోరటి ఆనంద్‌మాదిగ, తిరువూది బాబూమాదిగ, గద్దల విల్సన్ మాదిగ, ఎంఈకేఎఫ్ నాయకులు తంబులూరి కిషోర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ సంక్షేమాధికారి లక్ష్మానాయక్

# ప్రజల పట్ల బాధ్యత కలిగి ఉండాలి

- వ్యాపారస్తులతో జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్

ఒంగోలు సెంట్రల్: ప్రజల పట్ల వ్యాపారస్తులు బాధ్యత కలిగి వ్యాపారం చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి అడప ఉదయ భాస్కర్ సూచించారు. జిల్లాలోని రైస్, దాల్ మిల్, బియ్యం, కందిపప్పు టోకు వ్యాపారులతో శనివారం సమావేశం నిర్వహించారు. పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పెరుగుతున్న ధరల పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారని, ఆ మేరకు సమావేశం ఏర్పాటు చేశామని ఉదయ భాస్కర్ తెలిపారు. స్వచ్ఛందంగా కొంతమేర ధరలు తగ్గించాలని వ్యాపారులను కోరారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అన్ని లైసెన్స్‌లు సక్రమంగా తీసుకోవాలని, నిర్ణీత సమయం ప్రకారం ఉన్నవో.. లేవో చూసుకుని రెన్యువల్ చేసుకోవాలని కోరారు. ఆహార భద్రతా అధికారి ప్రభాకర్, తూనికలు, కొలతల అధికారి అనిల్, పౌర సరఫరాల కార్పొరేషన్ అధికారి గంగాధర్ వారి శాఖలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యాపారులకు వివరించారు. అన్ని లైసెన్సులు కలిగి సక్రమంగా తక్కువ లాభాలతో వ్యాపారం చేసి ప్రజలకు అధిక ధరల నుంచి విముక్తి కల్పించాలని సహాయ పౌర సరఫరాల అధికారి ఐ.పుల్లయ్య కోరారు.



వ్యాపారులకు సూచనలిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్

# లైటింగ్ డెకరేషన్‌కు టెండర్ల ఆహ్వానం

ఒంగోలు టౌన్: స్థానిక పోలీసు స్పోర్ట్స్, కమ్యూనిటీ, కల్చరల్ సెంటర్లకు ఫ్లవర్ డెకరేషన్, లైటింగ్ డెకరేషన్‌కు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పోలీసు కల్చరల్ సెంటర్ ప్రెసిడెంట్, ఎస్పీ సుమిత్ సునీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూలై 21 నుంచి 2026 జూలై 20వ తేదీ వరకు కాలపరిమితితో ఆసక్తి కలిగిన వారు టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. ఎంపికైన కాంట్రాక్టర్‌కు అగ్రిమెంటు ప్రకారం ఈ నెల 17వ తేదీ నుంచి కమ్యూనిటీ హాలును అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 91211 02221 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



కొంచెం స్టో..



హస్కీ జాతి కుక్కలు




కుక్కలను ఆసుపత్రికి తీసుకువస్తున్న పెంపకందారులు

# హ్యాపీ.. హ్యాపీ.. డాగీ

సాక్షి, ఒంగోలు: జంతు ప్రేమికుల్లో ఎక్కువ మందికి నచ్చేవి శునకాలే. వాటి తెలివితేటలు.. యజమానులపై అవి పెంచుకొనే అభిమానమే వాటిపై అంతా మక్కువ చూపడానికి కారణం. మరికొంతమంది పిల్లులు.. పక్షులు కూడా పెంచుకుంటుంటారు. ఎలాంటి జంతువులైనా వాటి నుంచి మనకు వ్యాధులు రాకుండా.. అవి కూడా ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాక్సినేషన్ తప్పనిసరి. శనివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఒంగోలు నగరంలో నిర్వహించిన రాబిస్ వాక్సినేషన్ కార్యక్రమానికి యజమానులు తమ పెట్‌లతో తరలివచ్చారు.



పగ్(హచ్‌డాగ్)



షిజ్జు జాతి కుక్క



నేను కూడా బైక్ ఎక్కా..



గ్రేడెన్ జాతి కుక్క



జూనోసిస్ డే సందర్భంగా వ్యాక్సిన్ వేయించేందుకు పోలీస్ జాగిలాలను తీసుకువస్తున్న పోలీస్ సిబ్బంది

## అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

పొదిలి: అపార్ట్‌మెంట్‌పై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. కోమటికుంట్ల సుబ్బయ్య (40) దర్శి రోడ్డులోని ఎస్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబంతో సహా అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో శనివారం అపార్ట్‌మెంట్‌పైన ఉన్న నీటి తొట్టిని శుభ్రం చేసేందుకు పైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కాగా కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

## ఆకతాయికి దేహశుద్ధి

- కారుకు పోలీసు హారన్ బిగించి హల్‌చల్
- మహిళల సమీపంలోకి కారు తీసుకెళ్లి టీజింగ్
- స్తంభానికి కట్టేసి చితకబాదిన స్థానికులు

ఒంగోలు టౌన్: కొత్తగా కొనుగోలు చేసిన కారుకు పోలీసు హారన్ బిగించిన ఓ ఆకతాయి ఒంగోలు నగరంలో రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ భయాందోళనలు సృష్టించాడు. ఒక మహిళ సమీపంలోకి కారు పోనిచ్చి భయపెట్టేందుకు ప్రయత్నించి దెబ్బలు తిన్నాడు. పేర్నమిట్టకు చెందిన ఓ వ్యక్తి తన సోదరుడితో కలిసి ఇంటీరియర్ డెకరేషన్ పనులు చేస్తుంటాడు. ఇటీవలే కొత్తకారు కొని.. మూడు, నాలుగు రోజుల నుంచి పగలు రాత్రీ తేడాలేకుండా పోలీసు హారన్ మోగించుకుంటూ అతివేగంగా తిరుగుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం తాలుకా పోలీసు స్టేషన్ ఎదురుగా రోడ్డుపై కారు నిలబెట్టి హారన్ మోగిస్తూ రచ్చ చేశాడు. శనివారం పేర్నమిట్టలోని ఒక హోటల్ యజమానిని భయపెట్టేందుకు యత్నించగా అతను.. సదరు కారు నడుపుతున్న వ్యక్తిపై పెట్రోలు చల్లినట్లు చెప్పుకుంటున్నారు. అనంతరం రోడ్డుపై వెళుతున్న ఒక మహిళకు అతి సమీపంలో కారు తీసుకెళ్లి ఆటపట్టించాడు. ఆగ్రహానికి గురైన సదరు మహిళ బంధువులు, స్థానికులు కలిసి ఆకతాయిని పట్టుకొని పేర్నమిట్ట బస్టాండులోని డివైడర్ వద్ద పోల్‌కు తాళ్లతో కట్టేసి చితకబాదారు. కాగా ఇతని వ్యవహారంపై పోలీసులు శుక్రవారం నుంచే గాలిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు.



ఆకతాయిని పోల్‌కు కట్టేసిన స్థానికులు





## యువకుడు అనుమానాస్పద మృతి

సింగరాయకొండ: వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన దాడిలో గోపి (33) అనే యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున జాతీయరహదారిపై ఉన్న విమానాల రన్‌వే పక్కన పోలేరమ్మ గుడి సమీపంలోని హోటల్ వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఇంటూరు గ్రామానికి చెందిన గోపి, గుంటూరు జిల్లా తెనాలిలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన లక్ష్మి గత ఏడు సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నారు. కాగా ఆరునెలలుగా లక్ష్మి గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామానికి చెందిన నాగరాజుతో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో తనతో ఉండమని గోపి.. లక్ష్మిని బ్రతిమలాడేవాడు. ఈ క్రమంలో లక్ష్మి, నాగరాజు కలిసి తరచూ గోపిపై దాడి చేసేవారు. శనివారం తెల్లవారుజామున కూడా గోపిపై వీరిద్దరూ దాడి చేశారు. దీంతో అతను చనిపోయి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించనున్నట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. మృతదేహాన్ని ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు పరిశీలించారు. ఎస్సై టి. శ్రీరామ్, ఏఎస్సైలు షేక్ మహబూబ్‌బేగ్, శేషారెడ్డి, రైటర్ షేక్ షాకీర్ బాషా, కానిస్టేబుల్ సుమన్, శశిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్

## ఏపీయూడబ్ల్యూజే నూతన అధ్యక్షునిగా రమణ





మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు, పక్కన ఎన్‌వీ రమణ

మార్కాపురం టౌన్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీయూడబ్ల్యూజే కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన ఎన్‌వీ రమణ తెలిపారు. జిల్లా కమిటీ ఎన్నిక శనివారం మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో ఎన్నికల అధికారి బి. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. కమిటీ జిల్లా నూతన అధ్యక్షునిగా ఎన్‌వీ రమణ, ఉపాధ్యక్షులు ఎస్‌కే ఇష్తేకర్, విజయ భాస్కర్, కార్యదర్శిగా దాసరి కనకయ్య, కోశాధికారులుగా డి. శరవణ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా బంకా శ్రీనివాసులు, పి. వెంకటేశ్వర్లు, ఎస్‌కే మీరా మొహిద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి యం. మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కుమార్, జి. రమేష్, కోటిరెడ్డి, మహమ్మద్ బాషా, షాబీర్ హుస్సేన్, విజయ్‌కుమార్, టి. అంజిరెడ్డి, రవికుమార్, శ్రీను, హనీఫ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ మీడియా కమిటీని కూడా ఎన్నుకున్నారు.

## పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన కిడ్నాప్ నిందితులు

మార్కాపురం రూరల్: గత నాలుగు రోజుల క్రితం బినర్వ గ్రామం వద్ద జరిగిన కిడ్నాప్ కేసులో నిందితులైన మార్కాపురం మండలం గొట్టి పడియ, బినర్వ గ్రామాలకు చెందిన నిందుతులైన మిర్చి రైతులు శనివారం రాత్రి మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు తెలిసింది. తమ వద్ద కొనుగోలు చేసి ఏడాదిన్నరగా డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండగా.. తాము అతన్ని తీసుకువెళ్లి అడిగామని అంతకు మించి ఏమీ చేయలేదని పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది.